
క్లుప్తంగా

నేడు వైఎస్సార్ వర్ధంతి



విద్యుత్ కాంతుల్లో వైఎస్సార్ విగ్రహం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలోని కూడలిలో మంగళవారం ఉదయం జరగనున్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి వర్ధంతిని నిర్వహించనున్నట్లు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కొణతనేని మణినాయుడు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్నదానంతో పాటు పలు సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని కోరారు.

వైఎస్సార్ విగ్రహం ముస్తాబు

రేణిగుంట: దివంగత మహానేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి 16వ వర్ధంతి సందర్భంగా సోమవారం మండల పార్టీ అధ్యక్షుడు గంగారి రమేష్, సర్పంచ్ నగేశం రేణిగుంటలోని వైఎస్సార్ విగ్రహాన్ని శుభ్రం చేసి విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు.

చేతిపంపు ఏర్పాటు చేయాలని వినతి



ఎంపీడీఓ వెంకటరత్నమ్మకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని వెస్టువరత్తూరు గ్రామంలోని సుబ్బరాయులుస్వామి ఆలయం సమీపంలో చేతిపంపును ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ వెంకటరత్నమ్మకు గ్రామస్తులు సోమవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో సుబ్బరాయులుస్వామి ఆలయ సమీపంలో పశువులు మేత కోసం వెళ్తాయని, భక్తులు సైతం గుడికి వస్తారని తెలిపారు. తాగునీటికి పశువులు, కాపర్లు, భక్తులు ఇబ్బంది పడుతున్నారన్నారు. చేతిపంపును ఏర్పాటు చేసి భక్తులు, పశువుల దాహార్తిని తీర్చాలని కోరారు. దీనిపై స్పందించిన ఎంపీడీఓ వెంకటరత్నమ్మ చేతిపంపు ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

మృత్యుంజయుడికి పూజలు



ప్రత్యేక అలంకరణలో మృత్యుంజయస్వామి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయం లోని మృత్యుంజయస్వామికి సోమవారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గణపతిపూజ, కలశ స్థాపన పూజలు చేశారు. అనంతరం స్వామివారికి చందనం, నారికేళ్ల, పసుపు, కుంకుమ, విబూది వంటి వాటితో అభిషేకాలు చేశారు. అనంతరం స్వామివారిని సుందరంగా అలంకరించగా భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, వేదపండితులు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్ అందుకుంటున్న గుడ్లూరు మయూర్

శ్రీకాళహస్తి: పట్టణానికి చెందిన ఎంజీఎం గ్రూప్ డైరెక్టర్ గుడ్లూరు మయూర్‌కు డాక్టరేట్ లభించింది. గుడ్లూరు మయూర్ చేస్తున్న సామాజిక సేవ, కరోనా సమయంలో అందించిన సేవలను గుర్తించి బీహార్ రాజధాని పాట్నాకు చెందిన భారత్ విర్చువల్ యూనివర్సిటీ వారు ఈ డాక్టరేట్ అందజేశారు. బాలీవుడ్ నటుడు విందు ధారాసింగ్, యూనివర్సిటీ ఛైర్మన్ కుమార్ రాజేష్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా మయూర్ మాట్లాడుతూ తన తండ్రి గుడ్లూరు మల్లికార్జుననాయుడు, కుటుంబ సభ్యులు స్నేహితులు, ఎంజీఎం గ్రూప్ కుటుంబ సభ్యుల సహకారంతో తనకు ఈ డాక్టరేట్ లభించిందన్నారు. తనపై మరింత బాధ్యత పెంచిందని తెలిపారు.

ఇద్దరికి జైలు

తిరుపతి లీగల్: తిరుపతిలో ఎక్కువ మద్యం సేవించి వాహనాలను నిర్లక్ష్యంగా నడుపుతున్న ఇద్దరికీ రెండు రోజుల జైలు శిక్ష, రూ.10వేల చొప్పున జరిమానా, అలాగే మరో 8మందికి సైతం రూ.10వేల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి 4వ అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ గ్రంధి శ్రీనివాస్ సోమవారం తీర్పు చెప్పారు. తిరుపతి ట్రాఫిక్ పోలీసులు నగరంలో తనిఖీలు నిర్వహించి మందుబాబులను కోర్టుకు హాజరు పరిచారు.

ఆ రోడ్డులో ప్రయాణం.. నరకం

పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి వెంకటాపురానికి వెళ్లే రోడ్డులో అన్నస్వామిపల్లి, వెంకటాపురం గ్రామాలతో పాటు మరో మూడు గ్రామాల ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు ప్రయాణిస్తుంటారు. ప్రస్తుతం రోడ్డులో గుంతలు ఏర్పడడంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. రోడ్డుకు ఇరువైపులా ముళ్ల చెట్లు అధికంగా ఉండడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనపడకపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. రాత్రి సమయాల్లో మరింత ఇబ్బందిగా ఉంటోందని గ్రామీణ ప్రజలు వాపోతున్నారు. సంబంధిత అధికారులు చొరవ చూపి రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

–రేణిగుంట









రేణిగుంట నుంచి అన్నాసామిపల్లికి వెళ్లే రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంతలు, (ఇన్‌సెట్) రోడ్డును కప్పేస్తున్న ముళ్ల చెట్లు

కాళికాదేవి ఆలయానికి దారిదే..!





దక్షిణ కాళికాదేవి ఆలయానికి వెళ్లాలంటే ఈ బురదను తొక్కాల్సిందే

దక్షిణ కాళికాదేవి ఆలయానికి ఎలా వెళ్లాలని స్థానికులు, భక్తులు ప్రశ్నిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షానికి దారి మొత్తం బురదమయం, రాళ్లు తేలడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ఆ మార్గంలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక పాదచారులు సైతం నడవడానికి కూడా దారి లేని పరిస్థితి ఏర్పడింది. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని పలువురు కోరుతున్నారు. –శ్రీకాళహస్తి

రోడ్డులో గుంత.. అదుపు తప్పితే ఇంతే..



రోడ్డుకు మధ్యలో గుంత ఏర్పడడంతో నిలిచిన వర్షపు నీరు

మండల కేంద్రంలోని స్థానిక పడమట హరిజనవాడ నుంచి టీపీ కోట వెళ్లే మార్గంలో రోడ్డు పూర్తిగా దెబ్బతిని గుంత ఏర్పడి ప్రమాదకరంగా మారింది. వర్షం పడినప్పుడు ఆ గుంతల్లో నీరు నిల్వ చేరి రాకపోకలు అంతరాయం ఏర్పడుతుంది. ప్రధానంగా కార్లు, స్కూల్ బస్సులు, ద్విచక్ర వాహనాలు ఆ గుంతల్లో దిగి ఇరుక్కుపోతున్నాయి. ఈ రోడ్డు మీదుగా టీపీ కోట నుంచి వందలాది మంది నాగలాపురానికి పనుల నిమిత్తం వస్తుంటారు. ఈ ఒక్క చోటే కాకుండా నాగలాపురం నుంచి కన్నావరం వరకు రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో గ్రామస్తులు సైతం రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వంలోని అధికారులు తాత్కాలికంగా గుంతలను పూడ్చకుండా, రోడ్డు నిర్మాణం పూర్తి చేసి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. –నాగలాపురం

వైద్య శిబిరానికి స్పందన



వరదయ్యపాళెంలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

వరదయ్యపాళెం: మండల కేంద్రమైన వరదయ్యపాళెం పీహెచ్‌సీలో తిరుపతికి చెందిన స్విమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సోమవారం పింక్ బస్ ద్వారా చేపట్టిన స్క్రీనింగ్ పరీక్షల్లో మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణకు మమోగ్రామ్, గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ నిర్ధారణ కోసం పాప్‌స్మియర్ పరీక్షలను నిర్వహించారు. అలాగే పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలను చేపట్టారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ మురళీధర్, ప్రశాంత్, పద్మావతి, చైతన్యభాను, ఎంపీడీఓ ప్రసాద్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ప్రాథమిక దశలో గుర్తిస్తే క్యాన్సర్ నివారణ





ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది, రోగులకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్ష చేస్తున్న వైద్యులు

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రాథమిక దశలో క్యాన్సర్‌ను గుర్తిస్తే తగిన చికిత్స అందించడం ద్వారా నివారించవచ్చనని.. ప్రతి ఒక్కరూ పింక్ బస్సుల్లో ఉచితంగా స్క్రీనింగ్ చేయించుకోవాలని వైద్యాధికారి మురళీధర్‌రెడ్డి, వైద్యురాలు ప్రశాంత్ తెలిపారు. స్విమ్స్ శ్రీబాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ ఆధ్వర్యంలో సోమవారం బుచ్చినాయుడుకండ్రిగ పీహెచ్‌సీలో ఉచితంగా పింక్ బస్సు ద్వారా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. మహిళలు, పురుషులు విశేషంగా విచ్చేసి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సహకారంతో తిరుపతి జిల్లాలో రెండు పింక్ బస్సుల ద్వారా మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వేగవంతంగా జరుగుతోందన్నారు. పింక్‌బస్సుల్లో మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ కోసం పాప్‌స్మియర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈనెల 4వ తేదీన గొల్లపల్లి, జయంపు, 8న వడమాలపేట, పరమేశ్వరమంగళం, 11న కుప్పంబాదూరు, కమ్మపల్లి, 15న పాకాల, దామలచెరువు, 18న దామినేడు, రేణిగుంట, 22న తారకరామానగర్ గ్రామాల్లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు జరుగనున్నాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్విమ్స్ డైరెక్టర్, వీసీ ఆర్వీకుమార్, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి నాగరాజ్ కోరారు. కార్యక్రమంలో వైద్యురాలు పద్మావతి, సీహెచ్‌ఓలు వెంకటేశులు, కృష్ణమరాజు, సూపర్‌వైజర్ జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం దుకాణాల తనిఖీ



బాటిళ్లను పరిశీలిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ

వరదయ్యపాళెం: మండల కేంద్రమైన వరదయ్యపాళెంలో గల పలు మద్యం దుకాణాలను ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సత్యనారాయణ నేతృత్వంలో సోమవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా దుకాణాల్లో అమ్మకాలు చేపడుతున్న మద్యం బ్రాండ్ల వివరాలను పరిశీలించారు. అనంతరం కొన్ని బ్రాండ్లను ల్యాబ్‌లలో పరీక్షించేందుకు శాంపుల్ తీసుకున్నారు. అలాగే లైసెన్సు వివరాలను కూడా పరిశీలించారు. నిర్దేశించిన ధరల కంటే అధిక ధరలకు మద్యం విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సాంకేతిక విద్యతో ఉజ్వల భవిత



జ్యోతి ప్రజ్వలనతో ఓరియెంటేషన్ ప్రోగ్రాం ప్రారంభిస్తున్న మహిళావర్సిటీ అధికారులు

తిరుపతి రూరల్: శ్రీ పద్మావతీ మహిళా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో కొత్తగా చేరిన 2025–2029 బ్యాచ్ విద్యార్థినులకు సోమవారం ఓరియెంటేషన్ కార్యక్రమాన్ని బేసిక్ సైన్సెస్, హ్యూమానిటీస్ విభాగం నిర్వహించింది. వీసీ ఆచార్య వి.ఉమ ప్రారంభించి మాట్లాడారు. సాంకేతిక విద్య ఉజ్వల భవిష్యత్తుకు నాంది పలుకుతుందని, శ్రద్ధతో ఒక లక్ష్యం నిర్దేశించుకుని చదివితే అద్భుత విజయాలు అందుకోగలరని దిశా నిర్దేశం చేశారు. రిజిస్ట్రార్ ఆచార్య రజిని మాట్లాడుతూ,తక్రమశిక్షణతో ఇంజినీరింగ్ విద్యను అభ్యసిస్తే సాఫ్ట్‌వేర్ రంగంలో దూసుకుపోగలరన్నారు. కార్యక్రమంలో కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.రామజ్యోతి, వెల్ఫేర్ డీన్ కె.ఉషారాణి, ఐక్వాక్ డైరెక్టర్ త్రిపుర సుందరి, పరీక్షల విభాగం డీన్ ఆచార్య కె.అనురాధ, పలువురు అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

మహాసభతోనే దళితుల్లో చైతన్యం



సమావేశంలో మాట్లాడుతున్న రిటైర్డ్ జడ్జి గుర్రప్ప

తిరుపతి కల్చరల్: నాటి దళిత మహాసభ ఉద్యమ స్ఫూర్తితో అంబేడ్కర్ సిద్ధాంతాన్ని ప్రాతిపదికగా తీసుకుని గ్రామ గ్రామాన ప్రజల్ని చైతన్యవంతుల య్యారని ఆర్‌పీఐ దక్షిణ భారత అధ్యక్షుడు పి.అంజయ్య అన్నారు. ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ ఆవిర్భవించి 40 ఏళ్లు అవుతున్న తరుణంలో సోమవారం సాయంత్రం అంబేడ్కర్ భవన్‌లో సమావేశం నిర్వహించారు. అంజయ్యతోపాటు రిటైర్డ్ జడ్జి పి.గుర్రప్ప మాట్లాడారు. 1985 జూలై 17న కారంచేడులో అగ్రకులస్తులు ఆరుగురు దళితులను కిరాతకంగా హత్య చేశారని, దీనిపై చలో చీరాల పేరిట నిర్వహించిన భారీ నిరసన కార్యక్రమం నేపథ్యంగా ఆవిర్భవించిన ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ ప్రస్థానాన్ని, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఏర్పాటైన శాఖలు, చేసిన పోరాటాల గురించి స్ఫూర్తిదాయకంగా ప్రసంగించారు. కార్యక్రమంలో దళిత సంఘ నేతలు చెంగల్‌రాయులు, ఎం.నాగరాజు, డాక్టర్ మునిరత్నం, ప్రభాకర్, ధనశేఖర్, గొడుగుచింత గోవిందయ్య, రాజేంద్రప్రసాద్ తదితరులు మాట్లాడారు.

సేంద్రియ కూరగాయల విక్రయం



సేంద్రియ పద్ధతిలో పండించిన కూరగాయలను విక్రయిస్తున్న రైతులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలోని ఎంపీడీఓ, ఐకేపీ కార్యాలయాల వద్ద సోమవారం రైతు సాధికారిత సంస్థ ఆధ్వర్యంలో సేంద్రియ, ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన కూరగాయలను విక్రయించారు. మండలంలోని గాజులపెళ్లూరు, ఆలత్తూరు, వీఎస్‌పురం, కనమనంబేడు, గ్రామాల్లో రైతు సాధికారిత సంస్థ ఆధ్వర్యంలో పలువురు రైతులు కూరగాయలు, వరిపంటలను ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించారు. సేంద్రియ పద్ధతుల్లో పండించిన ఆకుకూరలు, కూరగాయలను తింటే ఆరోగ్యానికి మంచిదని ఎంపీడీఓ తెలిపారు. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు ప్రభుత్వం రాయితీలను ఇస్తుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జ్ ప్రభావతి, ఐసీఆర్‌పీ రేవతి, మునిశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

రేపటి నుంచి పవిత్రోత్సవాలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం నుంచి పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఈఓ బాపిరెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన చేశారు. 3 నుంచి 7వ తేదీ ఆదివారం వరకు ఈ పవిత్రోత్సవాలు జరుగుతాయన్నారు.

ఆటో యూనియన్ ఏర్పాటు



ఆటో కార్మికుల యూనియన్ బోర్డును ఆవిష్కరిస్తున్న అఖిలపక్ష నాయకులు

వరదయ్యపాళెం: మండల కేంద్రమైన వరదయ్యపాళెం బస్టాండ్ ఆవరణలో నూతనంగా ఏర్పాటైన ఆటో కార్మికుల సంఘాన్ని ఏఐటీయూసీ అనుబంధంగా సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బస్టాండ్ ఆవరణలో ఆటో కార్మికుల యూనియన్ బోర్డును ఆవిష్కరించారు. అఖిలపక్ష నాయకుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఆంబాకం చిన్నిరాజ్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు వినోద్ యాదవ్, ఏఐవైఎఫ్ నాయకులు చంద్ర, కృష్ణమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికులకు అన్నదానం చేపట్టారు.

వేడుకగా ఆలయ కుంభాభిషేకం

సత్యవేడు: మదనంబేడు దళితవాడలో నూతనంగా నిర్మించిన వేంకటేశ్వర స్వామి ఆలయ కుంభాభిషేక మహోత్సవాలకు సోమవారం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం హాజరై స్వామివారి సేవలో తరించారు. టీటీడీ దేవస్థానం అందజేసిన విగ్రహాలను ప్రతిష్ఠించారు. గోవిందనామ స్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఆలయ పూజారులతో కలసి స్వామివారి తొలి పూజలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. తరువాత అదే గ్రామంలో సిమెంటు రోడ్డును ప్రారంభించారు. అనంతరం గ్రామ పరిధిలో ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదంలో ఇళ్లు కోల్పోయిన బాధితులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. సత్యవేడులో నూతనంగా నిర్మిస్తున్న టీటీడీ కల్యాణ మండపం పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ త్రివిక్రమరావు, సర్పంచ్ శివరంజని, వెంకటేశన్, ఎంఈఓ రవి, ఏపీఓ డాక్టర్ డాంగే యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

గాయపడిన వ్యక్తి మృతి

రేణిగుంట: మండలంలోని వెంకటాపురం వద్ద గత నెల 29వ తేదీ రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు రేణిగుంట అర్బన్ పోలీసులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. తెలంగాణ రాష్ట్రం జగిత్యాలలోని పురంపేట వీధిలో నివసించే కనపర్తి పరమేశ్వర్ కుమారుడు కనపర్తి సన్నత్ కుమార్ (33), స్నేహితుడు బాబావలి తిరుపతిలో మెడికల్ షాప్‌లో పని చేస్తున్నారు. ఇద్దరూ కలిసి సొంత పని మీద గత నెల 29వ తేదీ ఉదయం బుల్లెట్‌పై తిరుపతి నుంచి కరకంబాడి వైపు వెళ్తుండగా వెంకటాపురం నుంచి మెయిన్ రోడ్డులోకి వచ్చే ఓ ఆటో అతివేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరికీ గాయాలు కాగా స్థానికులు 108 వాహనంలో తిరుపతి రుయా హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం సన్నత్‌కుమార్ మృతి చెందాడు. మృతుడి తండ్రి సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన అర్బన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి



సదస్సులో రాస్ సిబ్బంది

శ్రీకాళహస్తి: పట్టణంలో పానగల్‌లోని రాస్ మహిళా వాణి కార్యాలయ ఆవరణలో సోమవారం రాస్ మహిళా పొదుపు సంఘాల సభ్యులకు ఆర్థిక స్వావలంబన, ఆడిట్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీనియర్ మేనేజర్ ఆర్.శేఖర్ రెడ్డి ఈ సదస్సు ప్రారంభించి మాట్లాడారు. మహిళలకు ఇలాంటి కార్యక్రమం రాస్ నిర్వహించడం అభినందనీయమన్నారు. తమ కుటుంబాలను మహిళలు అభివృద్ధి పథంలో నడిపించడానికి, ఆదాయాన్ని సమకూర్చుకునే మార్గాలు, అవకాశాలను, రుణం మంజూరులో తీసుకోవలసిన జాగ్రత్తలు, డబ్బు వినియోగం క్రమశిక్షణపై పాటించవలసిన పద్ధతులను తయన తెలియజేశారు. రాస్ పొదుపు సంఘాలలో అన్ని నగదు లావాదేవీలకు సంబంధించి ప్రతి ఏటా ఆడిట్ చేయించి ప్రభుత్వ సంస్థలకు దీటుగా పని చేయడం ఆనందంగా ఉందన్నారు. తమ బ్యాంకు సహాయ సహకారాలను అందిస్తామన్నారు. కార్యక్రమంలో రాస్ కృషి విజ్ఞాన కేంద్రం గృహ విజ్ఞాన శాస్త్రవేత్త బి.దివ్యసుధ, రాస్ మహిళా వాణి ప్రాజెక్ట్ ఆఫీసర్ జి.వెంకటేష్, ఫీల్డ్ ఆఫీసర్లు సుబ్బారావు, వినోద్, ముఖేష్, మీనా, నాగలక్ష్మి, షబ్నం, విజయలక్ష్మి, పల్లవి, జ్యోత్స్న, జయలలిత, జయంతి, రాజేశ్వరి, గౌతమి, స్వరూప, సునీత, సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ చిట్టిబాబు

నాగలాపురం: మండల కేంద్రంలోని స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏఓ చిట్టిబాబు రైతులకు, ఏపీసీఎన్‌ఎఫ్ సిబ్బందికి సమాచార హక్కు చట్టం 2005పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం గురించి రైతులు ఏ విధంగా దరఖాస్తు చేసుకోవాలి ? ఎంత రుసుము చెల్లించాలి ? ఏ కార్యాలయానికి వెళ్లాలనే విషయాన్ని రైతులకు క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో విస్తరణ అధికారి భరత్, ప్రకృతి వ్యవసాయం మండల ఇన్‌చార్జ్ ప్రభాకర్, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధికారులు

సమాచార హక్కు చట్టంపై అవగాహన

శ్రీకాళహస్తి: మండల పరిధిలోని అన్ని రైతు సేవా కేంద్రాల సిబ్బందికి మండల వ్యవసాయాధికారి సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రజలు ఏ విధమైన సమాచారాన్ని అడిగిన వారికి 30 రోజుల్లోపు పూర్తి సమాచారాన్ని అందించాల్సిన బాధ్యత ప్రతి ప్రభుత్వ అధికారిపై ఉందన్నారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.